క్లుప్తంగా

చెరువు తూము పరిశీలన

అనుమసముద్రంపేట: కొండమీదకొండూరు గ్రామ చెరువు తూమును నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. తూము శిథిలావస్థకు చేరడంతో సాగునీరు లీకై వృథాగా పోతోందని ఆయకట్టు రైతులు నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఏఈలు పెంచలరావు, పుల్లయ్య తూమును పరిశీలించారు. ప్రస్తుతం చెరువులో పూర్తిస్థాయిలో సాగునీరు ఉన్నందున రబీ పంట పూర్తయ్యాక మరమ్మతులు చేపడుతామని తెలిపారు.

కంటి వైద్యపరీక్షలు

ఉదయగిరి: ప్రపంచ అంధత్వ నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సక్షమ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రి వైద్యులు 230 మందికి కంటి వైద్యపరీక్షలు నినర్వహించారు. తొలుత ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. దివ్యాంగుల సంఘ నాయకుడు ఆదోని రమణయ్య , వైద్యులు ఠాగూర్, సక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, దివ్యాంగుల సంఘ నాయకులు సుబ్బరాజు, సురేష్ బాబు, చిన్న ఖాజావలి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సంగం: సిద్ధీపురం ఆర్‌బీకే పరిధిలోని వెంగారెడ్డిపాళెం, అనసూయనగర్‌లో సాగుచేసిన వేరుశనగ, మిరప, వంగ పంటలను ఆత్మ డీపీడీ జీ శివన్నారాయణ, కోఆర్డినేటర్ ఎంసీ ఓబయ్య, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి బుధవారం పరిశీలించారు. వేరుశనగ పంటలో వేరుకుళ్లు, పచ్చదోమ, ఆకుముడత, మిరపలో ముడత, వంగలో కొమ్మ, కాయతొలుచు పురుగులను గుర్తించి సస్యరక్షణ చర్యలు సూచించారు. వేరుశనగలో వేరుకుళ్లు తెగులు నివారణకు ఎకరాకు మాంకోజెబ్ 600 గ్రాము లు, కార్బండిజిమ్ 200 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. సంగం ఏఓ శ్రీహరి ఉన్నారు.

మొబైల్ ఏటీఎం సేవలు ప్రారంభం



అల్లూరు: మండలంలోని ఇస్కపల్లిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మొబైల్ ఏటీఎం సేవలను ఎంపీపీ శశిరేఖ బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇస్కపల్లిలో ఏటీఎం సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడు తుండడం గమనించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మొబైల్ ఏటీఎం సేవలను ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. మొబైల్ ఏటీఎం సేవను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు మేనేజర్ సోలమతి, సర్పంచ్ పాటి రంజిత్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బీద రమేష్, కొండూరు శ్రీను, వెంకయ్య, తంబి వాసు, తంబి శ్రీను పాల్గొన్నారు.

గోగులపల్లిలో గ్రామసభ

అల్లూరు: గోగులపల్లిలో ఎంపీడీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పంచాయతీ పరిధిలో మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. పంచాయతీ అభివృద్ధిలో ప్రజ లు భాగస్వాములు కావాలని కోరారు. ఈఓపీఆర్డీ వీరేంద్ర, ఉపసర్పంచ్ శంకరయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం



జలదంకి: మండలంలోని కొత్తపాళెంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి సర్పంచ్ చేరెడ్డి సుబ్బరత్తమ్మతో కలిసి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చేవూరు జనార్దన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం కొత్తపాళెం ఎస్టీ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును తనిఖీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, బిజ్జం ఎరుకలరెడ్డి, జ్యోతి రామచంద్రరావు, ఆవుల చినరాఘవరెడ్డి, గొట్టా మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు వడ్డీ లేని రుణం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మాండూస్ తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు పొగాకు పంట నష్టపోయిన రైతులకు రూ.10వేలు వడ్డీలేని పంట రుణం అందించేందుకు పొగాకు బోర్డు చర్యలు తీసుకుందని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. మర్రిపాడు మండలం ఖాన్‌సాహెబ్‌పేటలో పొగాకు క్యూరింగ్ ప్రక్రియను అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పొగాకు బోర్డు రైతు సంక్షేమ నిధి నుంచి రుణాలను అందజేయనున్నట్లు తెలిపారు. రుణాలు కావాల్సిన రైతులు ఫీల్డ్‌అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రుణ మొత్తాన్ని పొగాకు వేలం సమయంలో మినహాయించుకుంటామని తెలిపారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పాలన



చాబోలులో ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పెంపు వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొని 252 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ పెన్షన్ కానుకతో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు జగనన్న అండగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా పెన్షన్ నగదు మొత్తాన్ని పెంచుతున్నారని తెలిపారు. ప్రస్తుతం రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచి అందజేస్తున్నారని వివరించారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండలం చాబోలు, వెంకటాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం అవుతున్నాయని, అర్హులైన పేదలకు భూములు అందించాలని పలువురు కోరగా, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీటీ ఆనంద్‌రావుకు ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ గృహ లబ్ధిదారులు పెండింగ్ బిల్లుల చెల్లించాలని కోరగా, వెంటనే చెల్లించాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వం ద్వారా చేపట్టే కార్యక్రమాలతో పాటు ఎంజీఆర్ ట్రస్ట్ ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి, ఎంపీడీఓ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, సొసైటీ అధ్యక్షుడు నారపరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ హజరత్‌రెడ్డి, నాయకులు డీ కృష్ణప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి, పీ ఆదినారాయణరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, కే మల్లికార్జునరెడ్డి, వెంగళరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బీ రాజారెడ్డి, సుబ్బారెడ్డి, సీ నాగమోహన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, సీ మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బీ రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ప్రక్షానే రాజకీయం

నాలుగు దశాబ్దాల క్రితం తన తండ్రి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో ప్రారంభమైన మేకపాటి కుటుంబ రాజకీయం ప్రజాభీష్టం మేరకు నిబద్ధతతో కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా చాబోలులో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తాజా రాజకీయ పరిణామాలపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. వెంకటగిరి నియోజకవర్గంలో చోటు చేసుకున్న తాజా రాజకీయ మార్పులపై స్పందిస్తూ ఇతర నియోజకవర్గాల గురించి తాను మాట్లాడడం సబబు కాదన్నారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉంటాయని తాను భావిస్తున్నానన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో తన తండ్రి రాజమోహన్‌రెడ్డి, పినతండ్రి చంద్రశేఖర్‌రెడ్డి నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవ చేస్తూ ఆదరాభిమానాలు పొందారన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో తమ సొంత మండలం మర్రిపాడు మండలం ఆత్మకూరు నియోజకవర్గంలో చేరిందన్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు ప్రజలు తన సోదరుడు దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డిని రెండుసార్లు, తనను ఒకసారి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఆత్మకూరు. ఉదయగిరి నియోజకవర్గాలను రెండు కళ్లుగా భావిస్తూ తమ భవిష్యత్ రాజకీయాలు కొనసాగిస్తామన్నారు. ప్రత్యర్థులతో ప్రమేయం లేకుండా సీఎం వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. 40 ఏళ్లుగా మేకపాటి కుటుంబ రాజకీయాలు మచ్చలేకుండా సాగాయని, ఇకపైన ఆ ఒరవడి కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో నూతన ఒరవడి



నూతన పెన్షన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాల అమలు చేసి రాష్ట్ర చరిత్రలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో పెన్షన్ల పెంపు వారోత్సవాలను బుధవారం ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 199 మందికి నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత సంక్షేమ పథకాల అమల్లో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించి నిరుపేదలను క్షేత్రస్థాయిలో గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని వివరించారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని అర్హులు ఎవరైనా ఉంటే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, నివేశన స్థలాలు, పక్కాఇళ్ళు, రైతుభరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి,8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఆర్థిక భరోసా, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్, తదితర పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

'బీద'ను ప్రజలే తరిమికొడతారు: మద్దిబోయిన వీరరఘు

కావలి నియోజకవర్గంలో చౌకబారు రాజకీయాలు చేస్తున్న టీడీపీని, బీద రవిచంద్రను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిబోయిన వీరరఘు అన్నారు. రాజకీయ లబ్ధికోసం, చంద్రబాబు వద్ద పేరు కోసం రవిచంద్ర ఆడుతున్న నాటకాలు ప్రజలందరికీ తెలుసన్నారు. రాజకీయా లబ్ధి కోసం నమ్మిన ప్రతిఒక్కరిని నట్టేటా ముంచే రవిచంద్రకు ప్రజల్లో తిరిగే అర్హత కూడా లేదని విమర్శించారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, వైస్‌ఎంపీపీ మద్దిబోయిన పద్మ, సర్పంచ్‌లు పందిపాటి అనిత, బండ్ల సురేష్, బత్తల శ్రీనివాసులు, రేగలగడ్డ రామారావు, గిరి, ఎంపీటీసీ సభ్యులు మందా కౌసల్య, సుందర్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్రి అంకులయ్య, తుమ్మల రమణయ్య, కుందుర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన



వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలిగిరి: వెలగపాడులో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి జెడ్పీ నిధులతో బోర్లు వేయిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా వెలగపాడులో తాగునీటి సమస్య పరిష్కారానికి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేశారని వివరించారు. కలిగిరిలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జెడ్పీ నిధులు రూ.15 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకటసత్యనారాయణ, సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య, కలిగిరి ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న కొడవలూరు ధనుంజయరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు పోదామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, దుగ్గిరెడ్డి గువారెడ్డి, అల్లూరు రాజు, తదితరులు పాల్గొన్నారు.


యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపల్ వరకుమారి


ఆత్మకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్సార్‌జే డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న విక్రమ సింహపురి వర్సిటీ అంతర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. కళాశాల పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను వర్సిటీ అబ్జర్వర్ అమరా ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ జీ వరకుమారి, మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాగా తొలిరోజు పోటీల్లో ఆత్మకూరు ఎస్వీ డిగ్రీ కళాశాలపై బుచ్చి సెంట్‌మేరీస్ కళాశాల, సీతారామపురం కళాశాలపై ఆత్మకూరు ఏఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు షిర్డీ సాయిరాం కళాశాలపై కలిగిరి డాక్టర్ ఎస్సార్‌జే డిగ్రీ కళాశాల జట్లు విజయం సాధించాయి. లైబ్రేరియన్ పీ శ్రీనివాసులురెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మేకపాటి ఇంట కోలాహలం



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లికి బుధవారం చేరుకోవడంతో అధికారులు, నాయకులు తరలివచ్చారు. శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆత్మకూరు సీఐ నాగేశ్వర రావు, ఉదయగిరి మెరిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్‌రెడ్డి, ఆత్మకూరు కౌన్సిలర్లు చెరుకూరు కామాక్షయ్యనాయుడు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ తాజుద్దీన్, మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, స్థానిక నాయకులు బోయిళ్ల రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు



ఉదయగిరి: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి గురువారం నుంచి చేపట్టనున్న సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ డీఆర్పీలకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సామాజిక తనిఖీ బృందాలు, క్షేత్ర సహాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. 1 ఏప్రిల్ 2020 నుంచి 31 మార్చి 2022 వరకు రూ.18.53కోట్లతో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీఏ, ఎఫ్ఏలు సామాజిక తనిఖీ బృందాలకు సహకరించి పనులు చూపించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సార్పీ సుబ్బారావు, ఏపీఓ వెలుగోటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు: కమ్మవారిపల్లికి చెందిన పొగాకు రైతు నూతేటి హజరత్‌నాయుడు పొగాకు బ్యారన్ బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకు రాలి గొట్టాలపై పడడంతో మంటలు చెలరేగి పొగాకుతో పాటు బ్యారెన్‌లోని ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

పాఠశాలల్లో తనిఖీలు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియ, కృష్ణంపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సమ్మేటివ్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాభివృద్ధి, తాగునీటి సమస్యలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



చేజర్ల: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ పీర్ల పార్థసార ,పేర్కొన్నారు. ఆదూరుపల్లి సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ విజయలలిత, ఆర్‌ఐ సుమతి, పంచాయతీ కార్యదర్శి అచ్చి ఆంజనేయులు, సర్పంచ్ చేవూరి నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి



వరికుంటపాడు: రెవెన్యూ సిబ్బంది ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. మళ్లీ రెండు వారాల తర్వాత కార్యాలయానికి వస్తానని, ఆ లోగా పెండింగ్ అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. వేంపాడుకు చెందిన పలువురు భూసమస్యలపై అర్జీలు అందజేశారు. తొలుత తూర్పురొంపిదొడ్లలో నాడు–నేడు పనుల పురోగతిని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ అబ్దుల్‌హమీద్ ఉన్నారు.

'బీద' చౌకబారు రాజకీయాలు మానుకో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు

కావలి: ఎస్సీలను పావులుగా చేసుకుని చౌకబారు రాజకీయాలు చేయడాన్ని టీడీపీ నాయకుడు బీద రవిచంద్ర మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు హితవు పలికారు. పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, కందుల శ్రీనివాసులు, పరుసు మాల్యాద్రి, పద్మ, తదితరులు మాట్లాడారు. ప్రశాంతంగా ఉండే కావలిలోని ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, బీసీలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆదరిస్తూ వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులుగా ఉన్నారన్నారు. వీరిని ఎమ్మెల్యేకు దూరంగా చేసి రాజకీయంగా కావలిలో టీడీపీ ఉనికిని చాటాలని బీద రవిచంద్ర ప్రతి ఘటనను ఎస్సీ కోణంలో ప్రచారం చేసి, దానిని ఎమ్మెల్యేకు అంటగట్టి అలజడులు సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ కులంలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారాని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు అవహేళన చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎస్సీలను అడ్డం పెట్టుకుని బీద ఆడుతున్న డ్రామాలను గమనిస్తే ఆ నాడు చంద్రబాబు ఇందుకా మాట్లాడిందనే విషయం బోధపడుతుందన్నారు. ఎస్సీలకు సంబంధించి చిన్న విషయం జరిగిన బీద తనలోని దుర్మార్గమైన ఆలోచనలను అమలు చేయిస్తున్నాడన్నారు. బాధితులు ఎవరైనా న్యాయం జరగాల్సిందేనని, తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడాల్సిందేనన్నారు. కానీ ఎస్సీలు బాధితులు అయినప్పుడు మాత్రమే టీడీపీలోని ఎస్సీ నాయకులను అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేయించడం దారుణమన్నారు. బీద రవిచంద్ర ఫ్యాక్షన్ రాజకీయాలు, కులాన్ని అడ్డుపెట్టుకుని కుట్రలు చేయడం వల్ల బోగోలు మండలం తాటిచెట్లపాళెం, అల్లూరు మండలం ఇస్కపల్లి గ్రామ ప్రజలు ఎంత నష్టపోయారో అందరికీ తెలుసునన్నారు. ఆ పరిస్థితిని ఇప్పుడు కావలి నియోజకవర్గం అంతా అమలు చేయాలని వేస్తున్న ఎత్తులను ప్రజలు క్షమించరన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుందుర్తి కామయ్య, అక్కిలిగుంట మాల్యాద్రి, తాళ్లపాలెం సర్పంచ్ కటికాల సురేష్, పవిత్రన్, గాలి రజనీకాంత్, రాజేష్, రమేష్, గోసల కోటేశ్వరరావు, పేరం నాగరాజు, తాళ్లపాలెం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: క్రీడలు శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ సీజన్–2 టోర్నమెంట్‌లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు.టోర్నమెంట్ నిర్వాహకులు ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల దేవధీరజ్‌రెడ్డి బౌలింగ్ చేయగా ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి చెన్నాయపాళెం, విట్స్ కళాశాలల జట్ల మధ్యన మ్యాచ్‌ను ప్రారంభించారు.

మూడు బాళ్లు....మూడు పరుగులు

వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం చెన్నాయపాళెం, విట్స్ కళాశాలల మధ్యన జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. చివరిగా చెన్నాయపాళెం జట్టు మూడు బంతుల్లో మూడు పరుగులు చేయాల్సి ఉండగా, ఆ జట్టు బ్యాట్స్‌మెన్లు సమయస్ఫూర్తిగా ఆడి తొలి బంతికి రెండు పరుగులు తీశారు. రెండో బంతికి ఫోర్ కొట్టడంతో ఫీల్డింగ్‌లోని విట్స్ జట్టు క్రీడాకారులు చప్పట్లు కొట్టి అభినందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు కుందుర్తి కామయ్య, సైకిలాబ్, దేవరకొండ శ్రీనివాసులు అందజేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ

ఉదయగిరి: వైద్యారోగ్య సిబ్బంది సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచించారు. గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. సర్వేలు, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారి, స్టాఫ్‌నర్స్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. వైద్యాధికారి శివకల్పన, సీహెచ్ఓ శివకుమారి, ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్‌బాషా ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయాలి

అనుమసముద్రంపేట: పీహెచ్‌సీల్లో కాన్పులు చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఏఎస్‌పేట, చిరమన పీహెచ్‌సీలను, హసనాపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌ల్లో పరీక్షలు పెంచాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి కాన్పుకు మూడు రోజుల ముందు ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు పంపించాలని ఆదేశించారు. ఫ్లోరోసిస్ కేసులను గుర్తించి తగిన సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. వైద్యులు రహ్మతున్నీసా బేగం, దివ్య, మంజులమ్మ, రమేష్‌బాబు, వైద్యసిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఎంపీపీ తనిఖీలు

ఏఎస్‌పేట పీహెచ్‌సీని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యుడు రమేష్‌బాబు లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించగా, సరైన సమాధానం ఇవ్వలేదు. వైద్యుడి గైర్హాజరును జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని వినతి

ఉదయగిరి: మండలంలోని దీపం పథకం కనెక్షన్లకు సంబంధించిన ఇండేన్ గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఫాజిహాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గత ఐదు నెలలుగా సిలిండర్ల పంపిణీ నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. స్టాక్ పాయింట్ వద్దకు వెళితే ఎప్పుడూ మూసివేసి ఉంటోందని, కనీసం సమాధానం చెప్పే వారు కూడా కరువయ్యారని వాపోయారు. సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకుని సిలిండర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.